# పాణదాతలు

ఆ పొద్దు సందేళకాడ త్యాగరాజమండపంలో ఒక మీటింగు ఉండాది. ఆ మీటింగులో నేను మాట్లాడాల. మాట్లకేముండాది. వాటికిపాయ్ పేదరికం యాడుండాది? వచ్చిన యిబ్బంది అదిగాదు. ఏదో తమాసగా మాట్లాడ్తాడని పిలిస్తే పిల్సినపని చేసేసివస్తే సరిపోలా? అట్టగాదే ఈ జల్మం. జగడం ఎట్టొస్తింది జంగమయ్యా అంటే బిచ్చింపెట్టే బొచ్చుముండా! అనే బాపతు. అందుకే ఎప్పుటికప్పుడు దోవన పొయ్యే జగడం యింటిదాకా ఎందుకులే అని అనుకుంటానే ఉండేది. మల్లా ఎవుడైనా వొకడొచ్చి పిల్సీ పిలవకముందే గంగిరెద్దు మాదిర్తో తలకాయి ఆడించేది. ఆపొద్దు గూడా నా యవ్వారం శాస్త్రాలు పలికే బల్లికత మాదిర్నే తెల్లారె. వద్దు వద్దనుకుంటానే ఎవుడోవచ్చి పిల్సేకుందికి కద్దు అని ఎలబార్నా!

యాడికి? త్యాగరాజమండపం కాడికి!

ఇట్టాంటి వాటికి పిలవలేదని ఏడ్సే వాళ్లుండారు. కాదుగీదంటే ఎదురిచ్చి పిలిపించుకోని తీరా ఆడికిపాయ్ నోట్లో మాటరాకుండా ఏడ్సేవాళ్లుండారు!

ఏడుపా? దాని తాడుతెగ! ఎక్కళ్లేదు. నీలో ఉండాది. నాలో ఉండాది. ఇంట్లో ఉండాది. ఈదిలో ఉండాది. ఊళ్లో ఉండాది. రైతులో ఉండాది. రాజకీయం నడిపే వాడిలో ఉండాది. రాజ్జిం ఏలేవాడిలో ఉండాది. అయిద్రాబాద్ అసెంబ్లీలో ఉండాది. ఆడ డిల్లీ పార్లమెంట్లో ఉండాది. యాడ చూసినా ఏడుపే!

ఈ పొద్దు నేను గూడా ఆ మీటింగులో ఏదో ఒక ఏడుపు ఏడవాల! అయితే సత్తి పెమాణంగా చెప్తావుండా. ఆ పొద్దు మాత్రం ఆరునూరు గానీ లెక్కశారంగా నాలుగంటే నాలుగు మాట్లు మాట్లాడాలనుకుణ్ణా!

అనుకుంటానే ఆడికి పాయ్‌నానా? అలివిమాల్నె ఆ జనతోంబరాన్ని చూసినానా? ఊరికే ఉంటే ఊరా పేరా అని చేతులు కాల్చుకుంటావుండే ఆ పిలగాడి అగచాట్లు గెమనించినానా? అట్టా గెమనించేకుండికి అయ్యోయమనిపించిందా? దోవపొడగనా అనుకుంటా వచ్చినమాట ఎట్టపాయనో గాలికిపాయ. ఆ మీటింగులో పెద్దపీటే సి సందిడులావు పూలదండేసి కూసోపెట్నె పెద్దమణిసిని పొగిడేదానికి మొదులు పెట్నా. దిక్కుమాల్నె ఆజనం గూడా మాటమాటకు చేతులుతట్టి ఎక్క పెట్టినట్టుంటే ఆ పెద్దమణిసిని వొగిటేపారిగా ఏడుకొండలమిందికి ఎత్తేసినా!

ఆ మణిసి ఏడుకొండల మిందికి కాకపొయ్‌నా కడాన గాలిగోపరం కాడికైనా లేచిపొయ్యుండాల గదా! అని చూస్తే లేదే? కూసోనుండే కుర్సీ సాల్నట్టుగా అట్టాయిట్టా కదల్లేక కదల్తా ఉండాడు. పొగిడింపుల్తో ఉబ్బిపొయ్‌నాడుగదా పాపం! ఉబ్బేసి పబ్బం గడుపుకుందామని నేననుకుంటే ఆ మహన్నబావుడు ఉలకలా పలకలా! కుర్సీమాత్రం కిరకిర్లాడ్తా ఉండాది.

నిజం చెప్పొద్దూ! నాకైతే చింతకాయ కొరికినట్టయిపాయ!

''ఒరే! నీ మొకంబయిుశారా! ఉన్నోల్లకు కాళ్లుండాయంటివి. లేనోళ్లకు చేతులుండాయంటివి. కడుపు కొట్టుకుంటివి. నోరు మొత్తుకుంటివి. తెంపుగా తెపరాయిస్తివి. తొడలో సియ్యకోసిచ్చిన శిబిసెక్రవర్తి కత సెప్తివి. కుండలాలు కోసిచ్చిన కుంతి కొడుకు కత చెప్తివి. కారివేది మాదిరి కా.రే రాజులు అంటా రాగాలు తీస్తివి. అంతా బూడిదలో పోసిన పన్నీరైపాయగదరా?'' అని ఎవురూ నన్ను నిల్దీసి అడగలా!

అయినా వాళ్ల పిచ్చిగానీ బూడిది యింకా యాడుండాది? ఉండే బూడిదంతా ఊడ్చుకపాయ్ పోసినట్టు అయిద్రాబాద్ చేరిపోతే! బూడిదిలో పోసిన పన్నీరైపాయనంటే పన్నీరు పోసేదానికి బూడిది యాడుండాది?

ఒకరు నన్నడగలా. నాకు నాకే అలవకువగా ఉంటే మొకం మాడపెట్టుకోని వస్తావుండా.

మాడిన మొకాన ఆపొద్దు మాబాశాలి మజ్జిగపుల్సు కొట్టిందని నాకు తెల్సు. తెల్సి తెల్సి తప్పులు చేసే పెద్ద గొప్పతనం నా మొగతనం. మాడే మొకం యింకా మాడిపోతావుంటే మార్సుకోలేకుండా తలొంచుకోని అడుగుమింద అడుగ్గా నడస్తావుండా. అయినా బుర్ర ఊరుకోలేదే?

నా చిన్నప్పుడు మడికాడినుంచి ఎద్దల తోలుకోని వస్తాఉండా. మా మునిమామ కొడుకు ముత్తేలు దోవలో చెరుకు తింటా కనపడె. వాడు నాకంటే అయిదారేండ్లు పెద్దోడు.

అయినా నేనెప్పుడు ముత్తేలుగా అని పిల్సేటోణ్ణి. ఆ పొద్దు మాత్రం చెరుకు చేతిలో ఉండాదిగదా? అని 'మావా! మావా! ఒక గెణుపు చెరుకియ్యేమే?' అంటా సైన్‌చేసినా.

'' ఎంగిలి కదరా?'' అనె.

'' ఈ పక్క ఎంగిలైతే ఆ పక్క ఈరాదా?'' అంటి.

మాటమాటగా ఉండంగానే వాడు ఆపక్కన గూడా కొరికేసె.

'ఒరే నాయాలా! నువ్వింత పస్జేస్తావా?' అని నాకు వొళ్లుమండె.

అయినా తమాయించుకోని- .

''పోనీ నడిమిద్దె యీరాదా మామా?'' అని అడిగితే ఆ మాటతో గూడా వాడు చెరుకంతా నాకేసి నన్ను చూసి పకపక నవ్వె.

''ఒరే అబ్బోడా! ఏలుకోసుకుంటే సున్నం పెట్నోళ్లు... ఎంగిలిచేత్తో కాకిని యిదిలించనోళ్లు... ఈ లోకంలో శానామంది ఉండార్రా. అటుమంటోళ్లను అడిగి బంగపొయ్యేదానికంటే యాడైనా నీళ్లేని బాయిలో నిమ్మళంగా ముడుక్కోవచ్చు.'' అని మాయమ్మ చెప్తావుణ్ణెమాట అప్పుడు మణుసులో మెదిలె. మెదిల్తే ఏంచేసేది? అప్పుడు నీళ్లేనిబావులే లేవే. ఇప్పటిమాదిర అప్పుడుగానా యాడబడ్తే ఆడ నీళ్లలేని బావులు ఉండుంటేనా? ఇప్పుడు ఆ బాద ఉండేదే గాదు.

అయినా యిత్తనాల గింజల్ను అదునుపదును చూసి బూమిలో యిత్తితేమొలస్తాయి. అదే బండమింద చల్లితే? ఆ పొద్దు నాబతుకు అట్టయిపాయ. ఈ మాత్రం ఎరగనోణ్ణి! నేనూ ఒక మాటకారి కారవేది అనిపించుకుంటా ఉండా.

ఊళ్లో పెద్దమణిసి గదా అని-

''మహన్నబావా! శాతనైనాకాడికి మంచిపన్లకు చెయ్యి అందించి మంచిపేరు తెచ్చుకోరాదా. ఎనకటికి మిగలబొయ్యేది అదొగిటేగదా!'' అంటే-

వాడిపాసుగూల! వాడికేం తక్కువయిందని? మిద్దెలుండె. మేడలుండె. సిల్మాకొటాయిలుండె. చేసేదానికి ఊపిరి తిరగనన్ని యాపారాలుండె. ఆడికయిందా? ఇంక కార్ల కత కాడి కొస్తే బొమ్మలకొలువులో పెట్నెట్టు రకానికి వొగిటుండె. హు! ఊళ్లోదంతా పందికి సాలదంటే పంది నడిగే పాపాత్తుడెవుడు? పోనీ! ఈ సీమలో దేన్కైనా కరువొస్తింది కానీ పొగిడేవాళ్లకేం కరువా? ఇట్టా మాదిర పొగిడింపులకే వాళ్లు పొంగిపోతే పొంగేదంతా పొయ్యిపాలని వాళ్లకు తెల్దా? మాటల్తోనే వాళ్లను పిచ్చోళ్లను చెయ్యాలనుకుంటే మాట్లాడకుండానే వాళ్లు మనల్ను పిచ్చోళ్లు చేసేస్తారు.

ఒకడికి అంత పెట్టేబుద్ది పుట్టకతోనే రావాల్నేమో?

అదే మా రామన్న? పోనీ మేమన్నా ముత్తేబులా? సుద్దమిద్దిలో బతుకు. పొద్దుగూకులూ నేలతల్లితో పోరకలాడ్తే అంత మెతుకు! అయినా ఎమిక లేని చెయ్యే మా

రామన్నది. ఉడతలో మిడతలో తోటమింద పడ్తాయని మిరపతోట కాడ కావిలి కాస్తావుంటాడు. అప్పుడాదోవన పోతాపోతా వాళ్లెవురైనా సరే! –

''రామిరెడ్డీ!... రామిరెడ్డీ! అయినేరోళ్ల మునసామిని అదేపనిగా గోజార్తే నాలుగంటే నాలుగు వంకాయి లిచ్చినాడు. అవ్విగూడా పుచ్చిసచ్చినాయి. కావాలంటే చూసుకో రెడ్డీ. పుల్లంగా కారింగా పులగూర పాముకోవాల. నీకు పున్నెముంటింది. నాలుగే నాలుగు మిరపకాయిలు యియ్యేమే?'' అని అడిగితేచాలు. దోసెడు మిరపకాయిలు దుసి యిచ్చేస్తాడు. వాళ్లు అట్లాపోతానే యింకొకరిట్లా వస్తారు.

''రామన్నా! రామన్నా! యింట్లో ఆడది కడుపుతో ఉండాది. నోరు చవిసెడి పొయ్యిందంట. వంకాయ తీగూర చేసుకోని తినాలని వొగిటే రంపు చేస్తావుండాది. దాని రంపు రగలబడి పోనీ దాని కడుపులో ఒక కాయి కాస్తే నీపేరే పెట్టుకుంటా రెడ్డీ!'' అని అడిగితే చాలు. ఆయిల్లాలి కడుపులో కాయబొయ్యే కాయిని తల్సుకుంటా నవనవలాడ్తా ఉండే వంకాయిల్ను ఒక్క ఒడినిండికి కోసిచ్చేవాడు.

ఆకుతోటకు నీళ్లుకట్టానో తీగెదించతానో ఉంటే ఆదోవన పోతావుండే కాకి 'కార్' మంటే చాలు. అది అర్సేది తమలపాకుల కోసరమే అనుకోని అట్లాయిట్లా చూడకుండా పిడి ఆకులు పిరింగా దానం చేస్తాడు.

మడికాడ యవ్వారం ఆడికైతే యింక యింటికాడ కత యింకా అరుసోద్దింగా ఉంటింది. ఆయిన తినేదానికి కూసుంటాడనుకోండి. కూసోని సంకటో సలిబండో తింటావుంటాడనుకోండి. అట్లాంటప్పుడు ఎవుడైనా బిచ్చగాడు 'అంత అన్నం పెట్టు తల్లీ!' అని ఎలుగిస్తే చాలు. ఆయిన తింటా ఉండేది సంకటైనా సరే. అడిగినోడికి నోట్లోమాట నోట్లో ఉండంగానే వాడి మూకుట్లో అంతకూడు పడాల్సిందే. పడకుండా పొయ్యిందో వడ్డించే వాళ్లకు పడిపోతాయి. అదే వడ్డించేది మాయమ్మయితే ఆమె రోంత తాచ్చారం చేస్తే తింటా ఉండేది తింటా ఉన్నెట్టే యిడ్సి పెట్టేసి లేచి సక్కా పొయ్యేటేడు.!

'ఈళ్లతాత పెదరామిరెడ్డి. కుడిచెయ్యి సచ్చుబడిపాయ. పోతేమాత్రం ఏం? గుమ్మడికాయంత తలగుడ్డచుట్టి... తీర్సిదిద్దినట్టు మూడు నామాలు పెట్టి మొనగోడు గుర్రం ఎక్కినాడంటే ఆ పొయ్యికట్లో ఎద్దురుంగా నిలబడుకుంటే దానికి ఏ యదవకుండె గుండికాయిలు? దొంగల్లో దొరగదా మొగలాయి. పులికడపల్లో మేకలు పుట్టాయా? దరమాత్తుడుగదా మారామిరెడ్డి!''

మారామన్నకు యిట్లామాదిరి పొగిడింపులకు కొదవే ఉండేదిగాదు.

నాలుగు వంకాయిలు.. కాసిన్ని పచ్చిమిరపకాయిలు... పిడి తమలపాకులు యిచ్చేకుందికే మారామన్న దరమాత్తుడైపాయ. నెత్తినేసి కాల్చుకునేంత ఉండాదే! నెత్తిన పెట్టుకోని పోబోతారా? రోన్ని మంచిపన్లు చేస్తే నెత్తికెత్తి పెట్టుకోరా ఈ జనం? అయినా ఆమణిసి? అదేం మణుసో? ఎంతపొగిడినా నిమ్మకు నీరెత్తినట్టు నిమ్మళంగా కూసున్నే!

అదే పెద్దోళ్లకాలంలో అయితే-

తాగేదానికి నీళ్లడిగితే నీరుమజ్జిగ యిచ్చేవాళ్లంట. యాళకొస్తే కాళ్లకు నీళ్లిచ్చి పీటేసి సంకటిపలకంత యిస్త్రాకుపర్సి కడుపారా.కూడుపెట్టేవాళ్లంట. పెట్లేకపోతే పెట్టేగడపైనా చూపించేవాళ్లంట. ఇంక బాటల పక్కన చెట్లు పెట్టిన మహన్నబావులుండారు. ఆ చెట్లకింద చలవరాతి బండలెయ్‌పించిన దరమాత్తులుండారు. సలింద్రాలు పెట్టించినోళ్లుండారు. ఇట్టాంటి మణుసులుగూడా ఉండారు! అని ఆలోచించుకుంటా వస్తావుండా. వస్తావుంటే నాలుగ్గాళ్లమండపం కాడ ముత్తారెడ్డన్న మలేసుకుండె!

ఆయన్న మలేసు కున్నాడంటే వలేసి వంగదోసు కున్నెట్టే!

నిలబడ్తి!

''ఒరే అబ్బోడా! నీ బాద నాకు అర్తం అయిందిరా. పొగిడిందంతా ఉర్దా అయ్‌పొయ్‌నే అని గదా నీ బాద. అందుకుకాదురా నువ్వు బాదపడాల్సింది. మొన్న తుపానొచ్చిందా? అది ఎట్టొచ్చె? నగిరెమేళాల్తో నందితాళాల్తో వచ్చిందా? ముక్కెంగా కాలిమిందకాలేసి కూసోని- మునిగింది... మునగర్లి.. కొట్టుకోనిపొయ్యింది... పోర్లి... అరాకొరా చచ్చింది... చావర్లి... అంతా చూసొచ్చినాడా? వచ్చి అయ్యోకుయ్యోమని రొమ్ముగుద్దుకుంటా వొగిసినాడా? వొగస్తా 'అది చేసేస్తా యిదితీసేస్తా ! యింగొగిటి తోసేస్తా! అంటా ఆవునోరు పెట్టుకోని అరిసినాడా? కడాన పేపరోళ్లు...'

'' నువ్వు ఏమిస్తావయ్యా?'' అని అడిగితే-

''నా జీతం ఒక రూపాయే గదా'' అన్నాడా?

'' ఆరూపాయి కతే చెప్పు '' అంటే?

'' నా పాణాలే యిస్తాను!'' అని అన్నాడా?

''పాణాలిచ్చె ప్రెబువులుంటే యిటుమంటోళ్లు యిస్తేఎంత? ఈ కుండాపోతే ఎంత? నువ్వుపదరా! '' అనె.

''అదీ నిజిమేగదా? రూపాయి అయినా రూపాయే గదా? అది దేన్నైకైనా వొదిగితింది కదా? తూబెహ! పాణాన్ని ఏంచేసుకోవాల?'' అని మాడేమొకాన్ని మరింత మాడ్సుకుంటా యిల్లుచేర్నా. మాడిపొయ్యే మొకంమింద మజ్జిగపుల్సు కొట్టేదానికి మాబాశాలి యింట్లోలేదు. నేను పుట్టకముందెప్పుడో ఎన్టీవోడు ఏసింగట్నె పాతసిల్మా కొత్తకొటాయిలో ఆడ్తావుంటే దాన్ని చూసేదానికని చెక్కేసింది.

చూసేసి వచ్చిందంటే నా పాణం పొయ్‌నా సరే ఆ పాణదాతకే నా ఓటు! అని అంటింది. అనింది తప్పకుండా చేసి చూపిస్తింది! ●